నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, ఆదివారం 28 జనవరి 2024 | BHADRADRI KOTHAGUDEM

రామయ్య సేవలో హైకోర్టు జడ్జిలు

భద్రాద్రి ఆలయంలో ధ్వజస్తంభం వద్ద రామయ్యను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు

భద్రాచలం, జనవరి 27 : భద్రాచలం సీతారామచంద్రస్వామిని హైకోర్టు న్యాయమూర్తులు, జిల్లా ఫోర్ట్ పోలియో జస్టిస్ ఈవీ వేణుగోపాల్, జస్టిస్ కే శరత్ దర్శించుకున్నారు. కోర్టు భవనాన్ని ప్రారంభించేందుకు శనివారం భద్రాచలం విచ్చేసిన వారు ముందుగా రామయ్యను దర్శించుకునేందుకు ఆలయానికి రాగా.. ఆలయ మర్యాదలతో అధికారులు ఘన స్వాగతం పలికారు. ముందుగా ధ్వజస్తంభం వద్ద నమస్కరించుకొని అంతరాలయంలోని మూలవరుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు వారికి లక్ష్మీతాయారమ్మ వారి సన్నిధిలో వేదాశీర్వచనం, స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. వారి వెంట ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ టీ వసంతరావు పాటిల్, పీడీఎం జడ్జి రామారావు, భద్రాచలం న్యాయవాది కొడాలి శ్రీనివాసన్, ఎంవీ రమణారావు, పీ కృష్ణకుమార్, కోట దేవదానం, కొలిచలం నవీన్కుమార్, ఎంవీ.ప్రసాద్, మంత్రిప్రగడ గణపతిరావు, పలివెల నరసింహారావు, సాంబశివరావు, పామరాజు తిరుమలరావు ఉన్నారు.

హైకోర్టు జడ్జిలకు స్వాగతం పలికిన కలెక్టర్

సారపాక, జనవరి 27 : సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ విశ్రాంతి భవనానికి వచ్చిన హైకోర్టు న్యాయమూర్తులు ఈవీ వేణుగోపాల్, కె.శరత్‌లను కలెక్టర్ ప్రియాంక ఆల శనివారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారికి పుష్పగుచ్ఛం, మొక్కను అందించి ఘన స్వాగతం పలికారు. విశ్రాంతి భవనంలో పాలనాపరమైన అంశాలపై చర్చించిన వారు కలెక్టర్‌తో కలిసి భద్రాచలం వెళ్లారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా 'కొత్వాల' బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న కొత్వాల శ్రీనివాసరావు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 27 : జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్మన్‌గా కొత్వాల శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం డీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన రాయల వెంకటశేషగిరిరావును సొసైటీ డైరెక్టర్‌గా డిఫాల్టర్‌గా ప్రకటించారు. దీంతో ఆయన డీసీఎంఎస్ చైర్మన్ పదవిని కోల్పోయారు. ఈ క్రమంలో వైస్ చైర్మన్‌గా ఉన్న పాల్వంచ సొసైటీ చైర్మన్‌కు డీసీఎంఎస్ చైర్మన్‌గా డీసీవో అవకాశం కల్పించారు. దీంతో ఆయన నగరంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో చైర్మన్‌గా శనివారం బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మేనేజర్ సందీప్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

వీవీ పాలెం సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

- సమావేశానికి హాజరైన 11 మంది సొసైటీ డైరెక్టర్లు
- ఈ నెల 30న వెల్లడి కానున్న ఫలితం

అవిశ్వాస తీర్మానంలో పాల్గొన్న 11 మంది డైరెక్టర్లు

రఘునాథపాలెం, జనవరి 27 : మండలంలోని వి.వెంకటాయపాలెం ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ కూరాకుల నాగభూషణంపై శనివారం సొసైటీ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. చైర్మన్‌పై ఆ సంఘం డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం కోరుతూ ఈ నెల 11వ తేదీన డీసీసీబీ అధికారులకు వినతిపత్రం అందజేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టగా..13 మంది డైరెక్టర్లకు.. 11 మంది హాజరయ్యారు. సొసైటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తూ.. డీసీసీబీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు నిర్వర్తిస్తున్న కూరాకుల నాగభూషణంతోపాటు ఆయనకు అనుకూలమైన మరో డైరెక్టర్ సమావేశానికి గైర్హాజరయ్యారు. దీంతో ఒక వర్గానికి చెందిన 11 మంది డైరెక్టర్లు.. చైర్మన్ నాగభూషణంపై విశ్వాసం లేదని ప్రకటించారు. కానీ.. సమావేశం నిర్వహించిన డీసీవో విజయకుమారి మాత్రం ఫలితాన్ని ప్రకటించలేదు. అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నివేదికను కోర్టుకు సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 30న ఫలితం వెల్లడికానున్నట్లు తెలిపారు. అయితే సమావేశంలో పాల్గొన్న 11 మంది డైరెక్టర్లు తామే అవిశ్వాస తీర్మానంలో నెగ్గినట్లుగా ప్రకటించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై కొండల్‌రావు ఆధ్వర్యంలో వీ వెంకటాయపాలెం సొసైటీ కార్యాలయం వద్ద భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. అవిశ్వాస సమావేశంలో ఎంపీటీసీ యరగర్ల హనుమంతరావు, చావా నారాయణరావు, పుచ్చకాయల వీరభద్రం, నల్లమల ఆనంద్, పోట్ల వీరేందర్, సంక్రాంతి నాగేశ్వరరావు, బండి వెంకన్న, తమ్మిన్ని నాగేశ్వరరావు, కొత్తా కొమరయ్య పాల్గొన్నారు.

రామయ్యకు స్వర్ణ తులసి పూజలు

రామయ్యకు నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

భద్రాచలం, జనవరి 27 : శనివారం సందర్భంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మూలవరులకు స్వర్ణ తులసి పూజలు జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి నిత్య పూజలు చేపట్టారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి సంప్రదాయ బద్ధంగా నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలను అందజేశారు.

రామాలయానికి పోటెత్తిన భక్తులు

భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. శుక్రవారం రాత్రికే భద్రాచలం చేరుకున్న భక్తులు శనివారం తెల్లవారుజామున గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి.. రామయ్యను దర్శించుకోవడానికి క్యూలైన్లలో వేచి ఉన్నారు. భక్తుల రద్దీని ఊహించి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. అలాగే స్వామివారి నిత్య కల్యాణాల్లో రికార్డు స్థాయిలో 219 జంటలు పాల్గొన్నాయి. కాగా.. ఎంతో మంది భక్తులకు నిత్య కల్యాణాల టికెట్లు దొరకక ఇబ్బందులు పడ్డారు.

పంచాయతీల్లో ప్రత్యేక పాలనేనా ?

- ఈ నెలాఖరుకు ముగియనున్న పాలకవర్గాల గడువు
- 'పల్లె పోరు'పై స్పష్టత కరువు
- అయోమయంలో యంత్రాంగం

గ్రామపంచాయతీ కార్యాలయం

భద్రాద్రి కొత్తగూడెం, (నమస్తే తెలంగాణ)/అశ్వారావుపేట, జనవరి 27 : పంచాయతీల్లో పాలకవర్గాల పాలన ఐదు రోజుల్లో ముగియనున్నది. ఈ నెలాఖరు వరకే గడువు. మరోవైపు కనుచూపు మేరలో పంచాయతీ ఎన్నికలు జరిగే పరిస్థితే కనిపించడం లేదు. ఎన్నికల నిర్వహణ జరగాలంటే యంత్రాంగానికి తక్కువలో తక్కువ నెల రోజుల సమయం కావాలి. ప్రస్తుతం అంత సమయం లేనందున 'పల్లె పోరు'కు బ్రేక్ పడినట్లు స్పష్టంగా కనిపిస్తున్నది. ఇక పంచాయతీల్లో రాష్ట్రప్రభుత్వం పెత్తనం ఎవరికి అప్పగిస్తుందో వేచి చూడాల్సిందే. పర్సన్ ఇన్‌చార్జులను నియమిస్తారా? లేదా ప్రత్యేక అధికారులను నియమిస్తారా? అనే అంశం ప్రస్తుతం సందిగ్ధంలో ఉన్నది.

బీఆర్ఎస్ హయాంలోనే పంచాయతీల పెంపు..

ఉమ్మడి పాలనలో పంచాయతీలకు సొంత భవనాలు లేక పంచాయతీ కార్యదర్శుల నియమకాలు లేక పాలన అస్తవ్యస్తంగా ఉండేది. నాలుగైదు పంచాయతీలకు కలిపి ఒక సీనియర్ పంచాయతీ కార్యదర్శి పాలన కార్యకలాపాలు నిర్వహించేవారు. తెలంగాణ వచ్చాక గత కేసీఆర్ ప్రభుత్వం కొత్త పంచాయతీరాజ్ చట్టం తీసుకువచ్చి పంచాయతీ వ్యవస్థకు కొత్త రూపు తెచ్చింది. మారుమూల గిరిజన తండాలు, గూడేలకు పంచాయతీ హోదా కల్పించింది. గ్రామాల్లో అభివృద్ధికి బాటలు వేసింది. గ్రామస్థాయిలో ఎలాంటి అవాంతరాలు వచ్చినా ఇట్టే పరిష్కరించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పాలన అస్తవ్యస్తంగా మారింది. పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో.. కొత్త పాలకవర్గాలు ఎప్పుడు చార్జ్ తీసుకుంటాయో తెలియని పరిస్థితి నెలకొన్నది. ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే ఫలితాలు తారుమారు అవుతాయనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలను పట్టించుకోవడం లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది.

> 2018 ఆగస్టు 1న పంచాయతీల్లో పాలకవర్గాల గడువు ముగిసింది. ఇదే ఏడాది ఆగస్టు 2 నుంచి ప్రత్యేక పాలన అమలులోకి వచ్చింది. 2019 జనవరిలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఫిబ్రవరి 2న కొత్త పాలకవర్గాలు బాధ్యతలు స్వీకరించాయి. వచ్చే నెల 1న పాలకవర్గాల గడువు ముగుస్తుంది. 'పల్లె పాలన'పై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో అధికారులూ ఇప్పటివరకు అయోమయంలోనే ఉన్నారు.
>
> **ఇక ప్రత్యేక పాలనే గతి..**

ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు..

పంచాయతీ ఎన్నికలపై ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు. అలాగే పాలకవర్గాల గడువు ముగిసిన తర్వాత పంచాయతీల్లో పాలన ఎలా సాగుతుందనే అంశంపైనా స్పష్టత లేదు. అలాగే రిజర్వేషన్ల పైనా కసరత్తు జరగాల్సి ఉంటుందేమో. ఫిబ్రవరి నుంచి గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన సాగే అవకాశం కనిపిస్తున్నది. గ్రామాల్లో గతంలో నిర్వహించాల్సిన కొన్ని ఉప ఎన్నికలు కూడా నిలిచిపోయాయి.

– రమాకాంత్, డీపీవో, భద్రాద్రి జిల్లా

రిజర్వేషన్లపై మల్లాగుల్లాలు..

గత కేసీఆర్ ప్రభుత్వం కొత్త పంచాయతీ రాజ్ చట్టం తీసుకువచ్చి రెండు దఫాల పాటు పంచాయతీ ఎన్నికలకు ఒకే రిజర్వేషన్ వర్తించేలా చట్టం తీసుకు వచ్చింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలకు ఇదే రిజర్వేషన్ అమలు చేస్తుందా..? లేక కొత్త రిజర్వేషన్లకు ఏమైనా శ్రీకారం చుడుతుందా..? అనే విషయం ఇకముందు తేలనున్నది. ఈ విషయం తేల్చేందుకు సర్కార్ మల్లాగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తున్నది.

గురుకులం పిలుస్తోంది..!

- మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- జిల్లాలో ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో స్వీకరణ
- 5వ తరగతిలో 360, ఇంటర్‌లో 480 సీట్లు కేటాయింపు
- 6, 7, 8, తరగతుల్లో చేరేందుకూ అవకాశం
- ప్రవేశ పరీక్షలో మెరిట్ ఆధారంగా సీట్ల భర్తీ ప్రక్రియ

అశ్వారావుపేట, జనవరి 27 : నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన, కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం మైనార్టీ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసింది. వీటిలో ప్రవేశాల కోసం మైనార్టీ సంక్షేమ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లావ్యాప్తంగా ఆరు మైనార్టీ గురుకులాలు, ఆరు కళాశాలలు ఉండగా.. వీటిలో 840 సీట్ల భర్తీకి ఫిబ్రవరి 6వ తేదీ వరకు గడువుంది. 5వ తరగతిలో 360, ఇంటర్మీడియట్‌లో 480 సీట్లు భర్తీ చేయనున్నది. దీంతోపాటు 6, 7, 8 తరగతుల్లో ఖాళీలను కూడా భర్తీ చేసేందుకూ అవకాశం కల్పించింది. మైనార్టీ శాఖ అధికారులు విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్ల భర్తీ ప్రక్రియ చేపట్టనున్నారు. అయితే గురుకుల పాఠశాలల్లో చేరడానికి విద్యార్థుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉన్నది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

మైనార్టీ గురుకులాలు, కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సీట్లు భర్తీ చేయడానికి మైనార్టీ సంక్షేమ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఆన్‌లైన్ (https://tmreistelangana.cgg.gov.in) ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నది. వీటితో పాటు 6,7,8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నది.

6 పాఠశాలలు, 6 కళాశాలలు

జిల్లాలో 6 మైనార్టీ గురుకుల పాఠశాలలు, 6 కళాశాలలు ఉన్నాయి. వీటిలో 3 బాలికలు, 3 బాలుర గురుకుల పాఠశాలలు, 3 బాలికల గురుకుల కళాశాలలు, 3 బాలుర గురుకుల కళాశాలలు ఉన్నాయి. అశ్వారావుపేట, బూర్గంపాడు బాలికల పాఠశాలల్లో 40 చొప్పున 80 సీట్లు, కొత్తగూడెం గురుకుల పాఠశాలలో 80 సీట్లు, కొత్తగూడెం, ఇల్లెందు, మైనార్టీ బాలుర పాఠశాలల్లో 80 చొప్పున 160, భద్రాచలం గురుకుల పాఠశాలలో 40 సీట్లు ఉన్నాయి. అలాగే అశ్వారావుపేట, కొత్తగూడెం గురుకుల కళాశాలల్లో 80 సీట్లు(ఎంపీసీ, బైపీసీ), బూర్గంపాడు కళాశాలలో 80 సీట్లు(హెచ్ఈసీ, సీఈసీ), కొత్తగూడెం, ఇల్లెందు మైనార్టీ బాలుర కళాశాలల్లో 80 సీట్లు(ఎంపీసీ, బైపీసీ), భద్రాచలం బాలుర కళాశాలలో(హెచ్ఈసీ, సీఈసీ) 80 సీట్లు ఉన్నాయి.

25 శాతం నాన్ మైనార్టీలకు కేటాయింపు

వీటిలో 75 సీట్లు మైనార్టీలతో భర్తీ చేయనుండగా.. మిగతా 25 శాతం నాన్ మైనార్టీలకు రిజర్వ్ చేసింది. నాన్ మైనార్టీ రిజర్వేషన్లలో 12 శాతం బీసీలు, 6 శాతం ఎస్సీలు, 4 శాతం ఎస్టీలు, 2 శాతం ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేస్తున్నది. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలైతే రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో అయితే రూ.2 లక్షలు ఉండాలి. ఆన్‌లైన్ దరఖాస్తు గడువు ఫిబ్రవరి 6వ తేదీతో ముగుస్తుంది.

6 వరకు దరఖాస్తుల స్వీకరణ

మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో సీట్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఫిబ్రవరి 6వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల మెరిట్ ఆధారంగా సీట్ల భర్తీ ప్రక్రియ ఉంటుంది. ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్లు పక్కాగా అమలు చేస్తాం. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– టి.సంగీత, ప్రిన్సిపాల్, మైనార్టీ గురుకుల పాఠశాల, అశ్వారావుపేట

నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధర కల్పించాలి

ఏఎంసీ వ్యాపారుల సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

ఖమ్మం వ్యవసాయం, జనవరి 27: మార్కెట్ యార్డుకు రైతులు తెస్తున్న పంటకు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధర కల్పించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సూచించారు. ఖమ్మం ఏఎంసీలో 'మిర్చి క్రయవిక్రయాలు – ధరల' అంశంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు వ్యవసాయ మార్కెట్ వ్యాపారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌తో కలిసి శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యార్డుకు పంటను తీసుకొచ్చిన రైతుల ఉత్పత్తులను నిత్యం పరిశీలించాలని ఉద్యానశాఖ టెక్నికల్ అధికారులకు సూచించారు. జెండాపాటకు, మిగిలిన లాట్లకు భారీ తేడా ఉండవద్దన్నారు. ప్రతి రైతుకూ పంట నాణ్యతా ప్రమాణాలపై అవగాహన కల్పించాలని సూచించారు. నాణ్యత విషయంలో రైతులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. ఏఎంసీ అధికారులు, వర్తక సంఘం బాధ్యులు బజార్, వజీరుద్దీన్, చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలం, యడ్లపల్లి సతీశ్, దిరిశాల వెంకటేశ్వర్లు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, రమణ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరగాలి

ఎస్ఐబీ డీఐజీ సుమతి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న (ఎస్ఐబీ)డీఐజీ సుమతి

సారపాక/కొత్తగూడెం క్రైం, జనవరి 27 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని (ఎస్ఐబీ)డీఐజీ సుమతి అన్నారు. శనివారం సారపాక ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో జిల్లా పోలీసు అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉదయం నేరుగా హైదరాబాద్ నుంచి ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న ఆమెకు ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజ్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఎస్పీని జిల్లాలో ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు మావోయిస్టుల కదలికలపై సమాచారాన్ని సేకరిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు చేపట్టాలన్నారు. సీఆర్‌పీఎఫ్ బలగాలతో సమన్వయం పాటిస్తూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఐబీ ఎస్పీ బి.రాజేష్, 81బిన్ సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ మనీష్‌కుమార్‌మీనా, 141 సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ రితేష్ ఠాకూర్, కొత్తగూడెం ఓఎస్‌డీ టి.సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, 151బిన్ అడిషనల్ కమాండెంట్ అయోధ్యసింగ్, డీఎస్పీలు వెంకటేష్, రాఘవేందర్‌రావు, రమణమూర్తి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

టీబీజీకేఎస్ ఆవిర్భావ వేడుకల్లో సంఘం నాయకులు

సింగరేణి కార్పొరేట్‌లో కేక్ కట్ చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

కొత్తగూడెం సింగరేణి/ రామవరం, జనవరి 27: కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయమని టీబీజీకేఎస్ నాయకులు పేర్కొన్నారు. ఇందుకోసం తమ సంఘం ఎప్పటికీ అవిశ్రాంతంగా పనిచేస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. టీబీజీకేఎస్ అవిర్భావ వేడుకలను సింగరేణి కార్పొరేట్, ఏరియా, ఇతర కార్యాలయాల్లో సంఘం నాయకులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణిలో కార్మిక సంఘంగా 2003లో టీబీజీకేఎస్ ఆవిర్భవించిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకూ కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాడుతూ వస్తోందని వివరించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో అనేక హక్కులు సాధించుకున్నామని గుర్తుచేశారు. ఈ సందర్భంగా సంఘం జెండాలను ఎగురవేశారు. తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆవిర్భావ వేడుకల కేక్ కట్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సంఘం నాయకులు కాపు కృష్ణ, గడప రాజయ్య, రవికుమార్, విజయ్, వెంకటేష్, గణేష్, ఆంజనేయులు, మురళి, రామస్వామి, వెంకటస్వామి, కిరణ్, రాజ్‌కుమార్, సూరిబాబు, దొమ్మేటి నాగేశ్వరరావు, మోరె రమేశ్‌కుమార్, కరాటే శ్రీనివాస్, కిరణ్, శ్రీనివాస్, సూర్యకిరణ్, ఈవీ రావు, మురళి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో పలువురు సీఐల బదిలీలు

ఉత్తర్వులు జారీ చేసిన మల్టీజోన్-1 ఐజీపీ తరుణ్‌జోషి

మామిళ్లగూడెం, జనవరి 27: ఉమ్మడి ఖమ్మం జిల్లా, మల్టీజోన్-1 పరిధిలో పలువురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీపీ తరుణ్ జోషి ఈ నెల 26న ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జాతీయ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలీసు అధికారుల బదిలీలు చేపట్టినట్లు తెలిపారు. బదిలీ ఉత్తర్వులు అందుకున్న అధికారులు వెంటనే వారి వారి బదిలీ స్థానాల్లో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

బదిలీ అయిన సీఐల వివరాలు..

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
వి.ఉదయ్‌కుమార్	సీసీఆర్‌బీ ఖమ్మం	ఖమ్మం-1 టౌన్
టి.స్వామి	ఖమ్మం-1 టౌన్	సీసీఆర్‌బీ ఖమ్మం
డి.రమేశ్	వీఆర్ వరంగల్ అటాచ్‌డ్ (దుమ్ముగూడెం పీఎస్)	ఖమ్మం-3 టౌన్
బి.సత్యనారాయణ	ఖమ్మం-3 టౌన్	సీసీఎస్-2 ఖమ్మం
బి.బాలకృష్ణ	సీసీఎస్-2 ఖమ్మం	ఖమ్మం-2 టౌన్
కె.కుమారస్వామి	ఖమ్మం-2 టౌన్	మల్టీజోన్-1 ఐజీపీలో రిపోర్టు
భానుప్రకాశ్	సిద్దిపేట్-3 టౌన్	ఖానాపురం హవేలి
టి.శ్రీహరి	ఖానాపురం హవేలి	మల్టీజోన్-1 ఐజీపీలో రిపోర్టు
టి.కిరణ్	మహదేవపూర్ (జే.భూపాలపల్లి)	సత్తుపల్లి టౌన్
జె.మోహన్‌బాబు	సత్తుపల్లి టౌన్	మల్టీజోన్-1 ఐజీపీలో రిపోర్టు